క్లుప్తంగా

ఆహార భద్రత కమిటీలను ఏర్పాటు చేస్తాం

ఆర్మూర్: వినియోగదారుల సమస్యల పరిష్కారానికి వినియోగదారుల సంఘాలతో కలిసి ఆహార భద్రత కమిటీలను ఏర్పాటు చేస్తామని ఆర్మూర్ ఇన్‌చార్జి తహసీల్దార్ హరీష్ కుమార్ అన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వస్తు, సేవల నాణ్యత ప్రమాణాల ఉత్సవాల్లో భాగంగా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. వస్తువుల నాణ్యతే కాకుండా సేవలు, ఆహార పదార్థాల నాణ్యత పరిరక్షణలో ఆర్మూర్ అధికార యంత్రాంగం ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. వినియోగదారుల సంక్షేమ సమితి ప్రతినిధులు అనిల్ కుమార్, వీ.ఎస్ వర్మ, నందు ప్రవీణ్ కుమార్, మహాదేవుని శ్రీనివాస్, గైని రత్నాకర్, రాజుల రామనాథం, దేవేష్, శ్రీనివాస్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పీడీఎస్‌యూ పోరాటం



ఆర్మూర్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం, శాస్త్రీయ విద్యాసాధన, సమసమాజ స్థాపన కోసం పీడీఎస్‌యూ పోరాటం చేస్తోందని, తాము చేపట్టిన ఉద్యమాలు చాల కీలకమైనవని పీడీఎస్‌యూ పూర్వ నాయకులు పోచన్న, ఎన్.దాసు పేర్కొన్నారు. పట్టణంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో సోమవారం పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశంరం నిర్వహించారు. ఈ నెల 24న హైదరాబాద్‌లో నిర్వహించే పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది సభను విజయవంతం చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అనంతరం సభ కరపత్రాలను ఆవిష్కరించారు. నాయకులు ప్రిన్స్, సూర్యశివాజీ, సాయిరెడ్డి, అబ్దుల్, రవి, సూరిబాబు, బుస్సాపూర్ సాయన్న, గంగాధర్, రాజేష్, కైఫ్, ఫైసల్, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



ఆర్మూర్‌టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రియింబర్స్‌మెంట్స్ వెంటనే విడుదల చేయాలని యుఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. ఆర్మూర్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ కళాశాలలో స్కాలర్‌షిప్స్, ఫీజు రియంబర్స్‌మెంట్‌పై ఆధారపడి చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారేరకంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామన్నారు. నాయకులు మహేష్, గణేష్, రాజు, సురేందర్, అభిషేక్ పాల్గొన్నారు.

బంద్‌కు సహకరించండి



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఉషోదయ డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాలల నిరవధిక బంద్‌కు తల్లిదండ్రులు, విద్యార్థులు సహకరించాలని ప్రిన్సిపాల్ గంగాధర్ కోరారు. పట్టణంలోని వివిధ డిగ్రీ కళాశాలల కరస్పాండెంట్‌లు, అధ్యాపకులు, సోమవారం ఉషోదయ డిగ్రీ కళాశాల ఎదుట ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్స్, ఉపకార వేతనాలు చెల్లించక పోవడంతో కళాశాలల నిర్వహణ భారమౌతుందని, అధ్యాపకులకు వేతనాలు ఇవ్వలేక, కిరాయిలు కట్టలేక యాజమాన్యాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలన్నారు. శ్రీనివాస రాజు, సూర్యప్రకాష్, సాయిరెడ్డి, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయండి



బోధన్‌టౌన్(బోధన్): నిజామాబాద్‌లో ఈనెల 16న నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల రాష్ట్ర కార్యవర్గ సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూమయ్య కోరారు. బోధన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు, ఎస్సీ వర్గీకరణ సారథి మందకృష్ణ మాదిగ సమావేశానికి హాజరు కానున్నారన్నారు. సమావేశానికి ఎమ్మార్పీఎస్ నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు, అనుబంధ సంఘాలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. బండారి పోశెట్టి, గండమాల చంద్రయ్య, రవి, కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పూర్తయ్యేదెప్పుడు?

- అర్ధంతరంగా నిలిచిన మోర్తాడ్-చౌట్‌పల్లి క్రాస్‌రోడ్డు వెడల్పు పనులు
- పట్టించుకోని అధికారులు
- అసంపూర్తి పనులతో ఇబ్బందుల్లో వాహనదారులు





నిలిచిపోయిన మోర్తాడ్-వడ్యాట్ రోడ్డు వెడల్పు పనులు

మోర్తాడ్ : మండల కేంద్రం నుంచి వడ్యాట్ మీదుగా చౌట్‌పల్లి క్రాస్ రోడ్డు వరకు రోడ్డు వెడల్పు పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. అసంపూర్తి పనులతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రూ.6.50కోట్ల నిధులు మంజూరు..

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మోర్తాడ్ నుంచి చౌట్‌పల్లి క్రాస్‌రోడ్డు వరకు ఏడు కిలోమీటర్ల రోడ్డును వెడల్పు చేయడానికి రూ.6.50 కోట్లు మంజూరు చేశారు. అప్పటి మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి పనులకు శంకుస్థాపన నిర్వహించారు. ఏడాదిన్నర కింద పనులు ప్రారంభం కాగా ఇప్పటికీ పూర్తి కాలేవు. రోడ్డు వెడల్పు కోసం ఇరువైపులా హరితహారంలో నాటించిన మొక్కలు, చెట్లను సైతం నరికివేయించారు. పనుల్లో భాగంగా కంకరను పోయించారు. కానీ టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు ఆపివేశారు. గతంలో ఆర్ అండ్‌బీ శాఖ పరిధిలో చేసిన పనులకు బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయనే ఉద్దేశంతో కాంట్రాక్టర్ పనులు చేయడంలేదని ప్రచారం జరుగుతుంది. ఈక్రమంలో అధికారులు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకరావడానికి సాహసించడం లేదని తెలుస్తోంది. రోడ్డు వెడల్పు పనులు పూర్తి చేయకపోవడం, పోసిన కంకర అలాగే ఉండటంతో వాహనదారులు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు వెడల్పు పనులు త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి..



రోడ్డు వెడల్పు పనులు పూర్తికాకపోవడంతో ఇబ్బందిగా ఉంది. అసంపూర్తి పనుల కారణంగా రాత్రిపూట ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. తొందరగా రోడ్డు వెడల్పు పనులు పూర్తి చేయించాలి.

– పెండెం శ్రీనివాస్, వడ్యాట్

సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభం





తాళ్లరాంపూర్‌లో సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార గంగారెడ్డి.. రాయకూర్‌లో..

మోర్తాడ్: ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్ సహకార సంఘం ఆధ్వర్యంలో సోయా కొనుగోలు కేంద్రంను మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి సోమవారం ప్రారంభించారు. అనంతరం సంఘం ఛైర్మన్ పెద్ద కాపు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. సోయాకు ప్రభుత్వం రూ.4,892 మద్దతు ధర కల్పించిందని తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రంను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ పాలెపు నర్సయ్య, వైస్ ఛైర్మన్ సుంకెట బుచ్చన్న, డైరెక్టర్ లింగారెడ్డి, సహకార సంఘం డైరెక్టర్ ఆడెపు గంగాప్రసాద్ ఉన్నారు.

రాయకూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం..

రుద్రూర్: మండలంలోని రాయకూర్ సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ సురేష్ బాబా ప్రారంభించారు. తహసీల్దార్ తారాబాయి, విండో చైర్మన్ సంగమేశ్వర రావు, వైస్ చైర్మన్ తోట అరుణ్, నరోజీ గంగారామ్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు. రుద్రూర్‌లో నేడు వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు విండో చైర్మన్ సంజీవరెడ్డి తెలిపారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



మాక్లూర్: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వరి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని బీజేపీ కిసాన్ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు నూతుల శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. రైతులు ధాన్యం అమ్మకానికి సిద్ధంగా ఉన్నప్పటికి ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. మండలంలోని చిన్నాపూర్‌లో సోమవారం రైతులు రోడ్లపై ఆరబెట్టిన వరి ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా, ప్రభుత్వం అన్ని మండలాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు.

నూత్‌పల్లి జాతరకు వేళాయే!

- రేపటి నుంచి రాజరాజేశ్వరస్వామి ఉత్సవాలు ప్రారంభం
- ఏర్పాట్లు పూర్తిచేసిన ఆలయకమిటీ



నూత్‌పల్లిలోని శివాలయం

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని నూత్‌పల్లి జాతరకు సమయం ఆసన్నమైంది. ఐదు రోజుల పాటు జరిగే శ్రీ రాజరాజేశ్వర స్వామి ఉత్సవాలు ఈ నెల 16న ప్రారంభం కానున్నాయి. ఇక్కడి గుడిలోని శివలింగాన్ని దర్శించుకుని, కోరిన కోర్కేలు నెరవేరుతాయని ప్రజల ప్రగాడ విశ్వాసం. అందుకే ప్రతీ ఏటా అక్టోబర్‌లో నిర్వహించే స్వామివారి ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్ద ఎత్తున రానున్నారు. ఈక్రమంలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా గ్రామాభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీ, గ్రామస్తులు కలిసి ఏర్పాట్లను దాదాపు పూర్తి చేశారు. గుడికి రంగులు వేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. రవాణా సౌకర్యం కోసం ఆర్టీసీ అధికారులు ఒక బస్సు వేస్తామని హామీ ఇచ్చారు. పోలీసు బందోబస్తును కూడా ఏర్పాటు చేయనున్నారు. ప్రారంభం రోజు స్వామివారి ఊరేగింపు, కళ్యాణం, 17న అమ్మవారి బోనాలు (సలనంబర్లు), 18న అన్నదానం, రథోత్సవం, 19న స్వామివారికి నైవేద్యాలు, సామూహిక సత్యనారాయణ వ్రతాలు, 20న నాగవెల్లి, పల్లకీసేవ నిర్వహించనున్నారు.

జాతర ఎంతో ప్రత్యేకం..



ఏడాదికోసారి జరిగే రాజరాజేశ్వర స్వామి జాతర ఎంతో ప్రత్యేకం. విశిష్టత కలిగిన శివలింగానికి నిత్యాభిషేకం, దూపదీప నైవేద్యాలు సమర్పిస్తాం. పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు దర్శనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. రథోత్సవం వైభవంగా జరుగుతుంది. –బాపయ్య, ఆలయ పూజారి

ఘనంగా దుర్గామాత నిమజ్జనం

నందిపేట్/పెర్కిట్(ఆర్మూర్)/ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్, నందిపేట్ సహా పలు మండలాల్లో దుర్గామాత నిమజ్జనం సోమవారం రెండో రోజు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శోభాయాత్రలో డప్పుచప్పుళ్ల, డీజేల మధ్య యువకులు దాండియ, నృత్యాలు చేశారు. ఆర్మూర్‌లోని దుర్గామాత మండప నిర్వాహకులు ఏర్పాటు చేసిన అగోరాల నృత్యం ఆకట్టుకుంది. శోభాయాత్ర అనంతరం దుర్గామాతలను స్థానిక చెరువులు, నదులు, కుంటలలో నిమజ్జనం చేశారు.



ఆర్మూర్‌లో శోభాయాత్రలో డప్పువాయిద్యాలు



రాంపూర్‌లో నిమజ్జనానికి తరలి వెళ్తున్న దుర్గామాత



ఆర్మూర్ పట్టణంలో..



నందిపేటలో..







నృత్యాలు చేస్తున్న యువకులు.. దయానంద్‌నగర్‌లో అఘోరాల నృత్యం.. ఆర్మూర్ గూండ్ల చెరువులో అమ్మవారి విగ్రహాన్ని క్రేన్‌తో నిమజ్జనం చేస్తున్న దృశ్యం

వైభవంగా బతుకమ్మ సంబరాలు

వేల్పూర్: మండలంలోని అంక్సాపూర్, పడగల్ గ్రామాలలో సోమవారం రాత్రి బతుకమ్మ సంబురాలు వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో మహిళలు, యువతులు వివిధ రకాల పూలతో బతుకమ్మలు తయారు చేశారు. ప్రధాన వీధుల్లో ఏర్పాటు చేసి బతుకమ్మ పాటలు పాడుతూ ఆడారు. అనంతరం స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు.



పడగల్ గ్రామంలో..



అంక్సాపూర్‌లో బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న మహిళలు

గుండెపోటుతో ఎన్డీఎస్ఎల్ కార్మికుడి మృతి



బోధన్: నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ (ఎన్డీఎస్ఎల్) క్యాజువల్ కార్మికుడు కేశవ్(43) గుండెపోటుతో మృతి చెందాడని కార్మిక సంఘ నాయకులు సోమవారం తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కొడుకు, వృద్ధురాలైన తల్లీ ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

కేశవ్ (ఫైల్)

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1 -	మార్టిన్(తెలుగు)-9.00 3.30 10.10. జిగ్రా(తెలుగు)-12.10. వేట్టయన్(తెలుగు)-6.40
స్క్రీన్-2 -	దేవర పార్ట్-1 (తెలుగు) - 11.15 2.50 6.25 10.00
స్క్రీన్-3 -	వేట్టయన్ (తెలుగు) - 9.40, 4.00, 10.20, మా నాన్న సూపర్ హీరో (తెలుగు) - 1.10, 7.30
స్క్రీన్-4 -	విశ్వం (తెలుగు)- 9.30 12.45 4.00 7.15 10.30

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	విశ్వం(తెలుగు)-10.30 4.25 10.20 దేవర పార్ట్-1 (తెలుగు)- 7.10
స్క్రీన్-2	మా నాన్న సూపర్ హీరో -10.30,4.35 వేట్టయన్(తెలుగు)-1.30 7.30
స్క్రీన్-3	వేట్టయన్ - 10.30,4.20,10.30 మా నాన్న సూపర్‌హీరో - 7.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	జిగ్రా(తెలుగు)-12.15 దేవర పార్ట్-1(తెలుగు)- 3.35 మా నాన్న సూపర్ హీరో(తెలుగు)-7.10 మార్టిన్(తెలుగు)-10.10
స్క్రీన్-2	విశ్వం(తెలుగు)-12.35 3.50 7.05 10.20
స్క్రీన్-3	వేట్టయన్(తెలుగు)-11.50,8.30,10.00 మార్టిన్(తెలుగు)-3.20
స్క్రీన్ -4	మార్టిన్(తెలుగు)-10.00 మా నాన్న సూపర్ హీరో(తెలుగు)-1.10 జిగ్రా(తెలుగు) -7.20
లలితామహల్	దేవర పార్ట్-1(తెలుగు)
దేవి	మార్టిన్ (తెలుగు)
నటరాజ్	విశ్వం (తెలుగు)
విజయ్	దేవర పార్ట్-1(తెలుగు)

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	77,900	వెండి (కిలో)	93,800
22 క్యారెట్స్	71,872		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు


చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

సంక్షిప్తం

సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి


డొంకేశ్వర్(ఆర్మూర్): అన్ని గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని, ప్రతీ బూత్‌లో 400లకు తగ్గకుండా సభ్యత్వాలు చేయాలని బీజేపీ సభ్యత్వ అబ్జర్వర్ కోటపాటి నరసింహ నాయుడు కార్యకర్తలకు సూచించారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన పార్టీ సభ్యత్వ నమోదుపై బూత్ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. మండలంలో కనీసం ఏడువేల సభ్యత్వాలను పూర్తి చేయాలన్నారు. పోతుగంటి సురేందర్, నాయకులు సాగర్, మహేందర్ గౌడ్, మహేశ్, ముత్యం, తదితరులున్నారు.

పోలీసులకు ఫిర్యాదు



బాల్కొండ: మండలంలోని బస్సాపూర్ గ్రామంలో ఆదివారం నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో గోసంగి కులస్తులకు బతుకమ్మ తీసే అర్హత లేదంటు గ్రామానికి చెందిన కొందరు మున్నూరుకాపు సంఘ సభ్యులు కులం పేరుతో దూషించారంటూ బాల్కొండ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

లింగమయ్య ఆలయంలో పూజలు




బాల్కొండ: మండలకేంద్రంలోని లింగమయ్య ఆలయంలో సోమవారం టీఎస్ ఎండీసీ చైర్మన్ ఈరవత్రి అనిల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు.

జాతీయస్థాయి కథల పోటీల్లో ప్రతిభ

మోర్తాడ్: జాతీయస్థాయి కథల పోటీలో ఏర్గట్ల ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి అభిలాష్‌కు బహుమతి లభించింది. మాచిరాజు బాల సాహిత్య పీఠం ఆధ్వర్యంలో ఇటీవల కథల పోటీలు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల నుంచి విద్యార్థులు 250 కథలను పంపించారు. అందులో 20 ఉత్తమ కథలను ఎంపిక చేయగా అభిలాష్ రాసిన మంచి మనసు అనే కథకు బహుమతి లభించింది. నవంబర్ 3న హైదరాబాద్‌లో బహుమతి ప్రదానం చేయనున్నట్లు తెలుగు పండిట్ ప్రవీణ్ శర్మ వెల్లడించారు. విద్యార్థిని హెచ్‌ఎం శ్రీకృష్ణాచారీ, ఉపాధ్యాయులు అభినందించారు.

బాధితులను ఆదుకోవాలి



వేల్పూర్: కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్, డయాలసిస్ రోగులకు ప్రతినెలా రూ. 10వేల పెన్షన్ వచ్చేవిధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని బాల్కొండ, ఆర్మూర్ నియోజవర్గాల డయాలసిస్ రోగులు సోమవారం ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

ఘనంగా గౌస్ ఏ పాక్ సందల్

రుద్రూర్: మండలంలోని అక్బర్‌నగర్ గ్రామంలో సోమవారం గౌస్ ఏ పాక్ సందల్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ముస్లింలు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి సందల్, పూల్, చాదర్‌ను సమర్పించారు.

దాతలు ముందుకురావాలి

ఎడపల్లి(బోధన్): మండలంలోని జానకంపేట శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం గదుల నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని ఆలయ కార్యనిర్వహణ అధికారి వేణు



పేర్కొన్నారు. జాన్కంపేట్ గ్రామానికి చెందిన రాయిపల్లి శ్రీనివాసరావు, సంతోషి కుమారి రూ.2 లక్షలతో భక్తుల సౌకర్యార్థ గదిని నిర్మించారు. సోమవారం శ్రీనివాస్‌రావు దంపతులకు ఆలయ ఈవో వేణు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ నిర్వాహకులు కమల, రంగం కొండమాచార్యులు, రఘు పాల్గొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి



రుద్రూర్: రాష్ట్రంలో హిందూదేవత విగ్రహాలు ధ్వంసం చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం వారు మండల కేంద్రంలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. చర్యలు తీసుకోవడంలో పోలీసులు తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఆందోళన చేస్తున్న వారిని తీసుకెళ్లారు. బీజేపీ ఓబీసీ జిల్లా కార్యదర్శి సుధాకర్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

నేడు నందిపేటలో వైద్యశిబిరం

నందిపేట్ (ఆర్మూర్): మండల కేంద్రంలోని దుర్గాదేవి మందిరం వద్ద నందిపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి పశువులకు టీకాలు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలంలో మంగళవారం నుంచి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు మండల పశుసంవర్థక శాఖ అధికారి లక్కం ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మగ్గిడి గ్రామంలో నేడు నిర్వహించే టీకాల కార్యక్రమాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఫోటో14బియల్
కేర్6, ఫోటో